# ఫ్లాష్ బ్యాక్



పాతసినిమాలకు సంబంధించిన విశేషాలు.. నటీనటుల గురించి, సినిమాల గురించి, సాంకేతిక నిపుణుల గురించి.. వగైరా..వగైరా. ప్రతినెలా ఓసారి  అలనాటి సినీరంగంలోకి తొంగిచూద్దాం

## "పరిశీలనే పెద్ద గురువు" - ఎస్.వి.కృష్ణారెడ్డి

(విజయచిత్ర 1995 మే సంచికనుంచి పునర్ముద్రణ)




కిరాతకుడు (1986) చిత్రంలో ప్రతినాయక పాత్రలో నటుడుగా పరిచయమై, అనంతరం నిర్మాతగా, కథకుడుగా, దర్శకుడుగా, సంగీత దర్శకుడుగా పలు బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ విజయపథంలో పయనిస్తున్న ఎస్.వి.కృష్ణారెడ్డితో ఇటీవల 'విజయచిత్ర' జరిపిన గోష్ఠిలోని కొన్ని ముఖ్యాంశాలు ఇక్కడ ప్రచురిస్తున్నాము.

**మీ చిత్రరంగ ప్రవేశం ఎలా జరిగింది?**

మా స్వస్థలం తూర్పు గోదావరి జిల్లాలోని రాయవరం గ్రామం. చిన్నప్పటినుంచి నాకు సినిమాల పట్ల విపరీతమైన ఆసక్తి, ఆ కారణంగా విడుదలైన ప్రతి చిత్రం తప్పనిసరిగా చూస్తూ వుండేవాడ్ని, ఎం.కాం. పూర్తయిన తర్వాత రచయిత సత్యమూర్తి గారితో పరిచయం ఏర్పడడం. ఆయన ప్రోత్సాహంతో 'కిరాతకుడు' చిత్రంలో ప్రతినాయకుడుగా

నటించడం జరిగింది.

**నటుడుగా చిత్రరంగ ప్రవేశం చేసిన మీరు నిర్మాతగా, దర్శకుడుగా, సంగీత దర్శకుడుగా మారడానికి వెనుకగల కారణాలు ఏమిటి?**

'కిరాతకుడు' చిత్రంలో నటించిన తర్వాత కొంతమంది మిత్రులతో కలిసి 'సూర్యా ది గ్రేట్', 'దర్యాప్తు' అనే అనువాద చిత్రాల ద్వారా నిర్మాణ రంగంలో ప్రవేశించడం జరిగింది. డబ్బింగ్ చిత్రాల నిర్మాణం ద్వారా చిత్ర నిర్మాణానికి సంబంధించి కొంత అనుభవం గడించాను. ఆ అనుభవాన్ని పురస్కరించుకుని స్వంతంగా నేనే నిర్మాతగా, దర్శకుడుగా, సంగీత దర్శకుడుగా చిత్రాన్ని ఎందుకు నిర్మించకూడదు ? అనే ఆలోచన కలిగింది. ఫలితంగా హైదరాబాదులో మేము నిర్వహిస్తున్న మనీషా వీడియో షాప్ పేరు మీద 'మనీషా ఫిల్మ్స్' అనే సంస్థను స్థాపించి, రాజేంద్ర ప్రసాద్ కథానాయకుడుగా కథ, సంగీత దర్శకత్వం బాధ్యతలు వహిస్తూ తొలి ప్రయత్నంగా 'కొబ్బరి బోండాం' చిత్రాన్ని నిర్మించాను. ఆ చిత్రం ప్రారంభించినప్పుడు సంగీత దర్శకుడుగా నా పేరు వేసుకోవడం పలువురికి ఆశ్చర్యాన్ని కలిగించింది.

నిజానికి సంగీతంలో ఏ అనుభవమూ లేకుండా నేను సంగీత దర్శకత్వం వహించడానికి పూనుకోలేదు. చిన్నప్పటినుంచీ సంగీతం పట్ల కూడా నాకు ఎంతో ఆసక్తి వున్న కారణంగా అన్ని భాషా చిత్రాలలోని పాటల్ని వింటూ – వాటిల్లోని బాగోగులు నా మిత్రులతో చర్చిస్తూ వుండే వాడ్ని. అంతేగాకుండా నా ఇరవైయ్యవ ఏటనుండీ నటరాజ రామకృష్ణ గారి వద్ద శాస్త్రీయ నృత్యాన్ని అభ్యాసించాను. సంగీతాన్ని కూడా సాధన చేశాను. ఆ అనుభవంతోనే, 'దర్యాప్తు' అనువాద చిత్రానికి మాతృక అయిన, మలయాళ చిత్రంలోని సంగీతం మన 'నేటివిటీ'కి విరుద్ధంగా వున్నందువల్ల తెలుగులో ఆ చిత్రానికి రీ–రికార్డింగ్ బాధ్యతని నేను వహించాను. 'దర్యాప్తు' అనువాద చిత్రానికి నేను సమకూర్చిన 'రీ–రికార్డింగ్' సంగీతం పలువురి ప్రశంసలు పొందడంలో, నామీద నాకు ఒక విధమైన నమ్మకం ఏర్పడి – 'కొబ్బరిబోండాం' చిత్రానికి సంగీత దర్శకత్వం వహించే బాధ్యతని చేపట్టడానికి సాహసించాను. అదృష్టవశాత్తూ, ఆ చిత్రంలోని పాటలు విశేషంగా ప్రజాదరణ పొందాయి. ఇక మా సంస్థ రెండో చిత్రం 'రాజేంద్రుడు గజేంద్రుడు' చిత్రం నుంచి అదనంగా దర్శకత్వ బాధ్యతనూ చేపట్టడం జరిగింది. దర్శకత్వ శాఖలో ఏ అనుభవం లేని నేను దర్శకుడిగా మారడమూ చాలా మందిని ఆశ్చర్యపరిచింది.

నిజమే ! దర్శకత్వ శాఖలో నాకు అనుభవం లేదు. ఏ దర్శకుడి వద్దా సహాయకుడిగా పని చెయ్యలేదు. కానీ, ఎందరో ప్రముఖ దర్శకుల చిత్రాలు చూడడం ద్వారా, పరిశీలన ద్వారా దర్శకత్వానికి సంబంధించిన పలు విషయాలు నేర్చుకున్నాను. ఈ పరిశీలన అనేది నేను చలనచిత్రాలు చూడడం ప్రారంభించిన నాటినుండీ – అంటే తొమ్మిది, పదేళ్ళ

వయసు నుండే అలవాటైంది. పరిశీలనాజ్ఞానం వుంటే ఎవరి దగ్గరా సహాయకుడుగా పని చేయకపోయినా, ఎవరైనా దర్శకులుగా రాణించగలరు. ఎందుకంటే నా దృష్టిలో దర్శకుడన్న వాడికి పరిశీలనా జ్ఞానం ముఖ్యం. అంతేకాదు, పరిశీలనే పెద్ద గురువు అని నా అభిప్రాయం.

**నిర్మాతగా, దర్శకుడుగా, సంగీత దర్శకుడుగా, కథా రచయితగా ఇన్ని బాధ్యతలను మీరెలా సమర్థవంతంగా నిర్వహించగలుగుతున్నారు. ఒకేసారి ఇన్ని బాధ్యతలు నిర్వహించడం వల్ల ఏకాగ్రత లోపించే అవకాశం లేదంటారా?**

మనం ఏ కార్యాన్ని తలపెట్టినా, ప్రణాలికా బద్దంగా నిర్వహించ గలిగిన నాడు ఎన్ని బాధ్యతలనైనా సక్రమంగా, ఎటువంటి ఒత్తిడీ లేకుండా సమర్థవంతంగా నిర్వహించ గలమని నా నమ్మకం. కథ, సంభాషణలు, ఆర్టిస్టుల కాల్ షీట్లు, పాటల కంపోజింగ్.. ఇతరత్రా అన్ని అంశాలు షూటింగ్ కు ముందే పకడ్బందీగా సిద్ధం చేసుకుంటాను. చిత్రం షూటింగ్ కార్యక్రమాలు కూడా అనుకున్నది అనుకున్నట్లుగా జరగడానికి అనువుగా ఉండేలా 'ప్లాన్' చేసుకుంటాను. అప్పటికీ అనుకోని విధంగా అనుకున్నది అనుకున్నట్లు జరగకపోతే – ఆ సమయాన్ని వృథా చెయ్యకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు కూడా ముందే ప్లాన్ చేసి వుంచుకుంటాను. అంచేత ఒత్తిడి అన్న మాటకు తావే ఉండదు.

**మీ అనుభవం దృష్ట్యా ఒక దర్శకుడు పరిశ్రమలో నిలదొక్కుకోవాలంటే తప్పనిసరిగా వుండాల్సిన అర్హతలేమిటి?**

చిత్ర నిర్మాణానికి సంబంధించిన అన్ని ప్రధానశాఖలకు సంబంధించిన సరైన అవగాహనను ఏర్పరచుకోవాలి. వాటిని సమన్వయ పరుస్తూ, తాననుకున్న స్థాయిలో అవి తెరమీద ఆవిష్కృతమయ్యేలా చూడగలగడంతో పాటూ, చిత్రాన్ని సకాలంలో అనుకున్న బడ్జెట్ లో పూర్తి చేసి నిర్మాతకు అప్పచెప్పగల సామర్థ్యం కలిగి వుండాలి. అప్పుడే ఆతను విజయవంతమైన దర్శకుడుగా పరిశ్రమలో నిలబడగలుగుతాడు.

**భారీ వ్యయంతో చిత్రాలను నిర్మించే విధానాన్ని మీరు సమర్థిస్తారా?**

ప్రస్తుత పరిస్థితుల్లో ఎంత చిన్న తారాగణంతో చిత్రాన్ని నిర్మించినా అధమ పక్షం అరవై లక్షల రూపాయలు ఖర్చు పెడితే గాని అనుకున్న రీతిలో చిత్రం పూర్తి కాదు. అంతకన్నా తక్కువ ఖర్చుపెట్టి చిత్రం నిర్మించాలంటే 'క్వాలిటీ' పరంగా రాజీపడక తప్పదు. 'పిండి కొద్దీ రొట్టె' అన్నట్లు 'ఖర్చు కొద్దీ క్వాలిటీ' రావడానికి ఆస్కారంవుంది. నా దృష్టిలో ఎనభై లక్షల నుండీ కోటీ రూపాయల వరకూ ఖర్చు పెట్టి మంచి క్వాలిటీతో చిత్రాన్ని నిర్మించొచ్చు. అంతకు మించి ఎక్కువ ఖర్చుతో చిత్రాలు నిర్మించి, నష్టం వచ్చిందని బాధపడడం సమంజసం కాదు. అంచేత ఎట్టి పరిస్థితుల్లోనూ చిత్ర నిర్మాణానికి సంబంధించి కథాపరంగా, అనుకున్న బడ్జెట్ కి మించి అనవసరంగా ఖర్చు పెట్టడం అంత శ్రేయస్కరం కాదు. ఇక పెద్ద హీరోలతో చిత్రాలు నిర్మించేటపుడు వాళ్ళ వాళ్ళ 'ఇమేజ్'ల దృష్ట్యా, ఆయా చిత్రాల వసూళ్ళను అంచనా వేసుకుని –

దానికి తగ్గట్లు నిర్మాణ వ్యయాన్ని అదుపులో వుంచుకోవాలి. అలాగే పాటల చిత్రీకరణ కోసం విదేశాలకు వెళ్ళడం అనేది వ్యయం దృష్ట్యా వ్యక్తిగతంగా నాకు అంత ఇష్టం వుండదు.

**ఒక సంగీత దర్శకుడుగా మీరు ఎటువంటి సంగీతాన్ని ఎక్కువగా ఇష్టపడతారు?**

తెలుగుదనాన్ని ఎక్కువగా ఇష్టపడే వ్యక్తిని నేను. జానపదాల్లో మించిన తెలుగుదనం ఇంకెక్కడా మనకు లభ్యం కాదు. జానపదాల్లో పాటలకు బాణీ చేకూర్చడం వల్ల అటువంటి పాటలు అందరికీ సులభంగా అర్థమై వినడానికి విందుగా, పాడుకోడానికి పసందుగా వుంటాయి. అందుకే, నా చిత్రాల్లోని పాటల్లో ఆ ధోరణే మీకు ఎక్కువగా కనిపిస్తుంది.

**ప్రస్తుతం మీరు దర్శకత్వం వహిస్తున్న చిత్రాల గురించి..**

ఆలీ హీరోగా 'యమలీల' నిర్మాణం పూర్తి కావచ్చింది. ఇదికాక బాలకృష్ణ కథానాయకుడుగా 'టాప్ హీరో', జగపతిబాబు హీరోగా వైజయంతీ మూవీస్ వారి చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నాను.

★★★

COMMENTS